మహాధర్నాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - వీరవాసరం

దేశంలో కార్మికులు, రైతులు, ఉద్యోగులు, కష్టజీవులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈనెల 27, 28వ తేదీల్లో జరగనున్న మహాధర్నాను జయప్రదం చేయాలని ఆశా వర్కర్స్ యూనియన్ వీరవాసరం మండల కమిటీ విజ్ఞప్తి చేసింది. ఆదివారం ఎంపిపి స్కూల్లో డి.వరలక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిఐటియు జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యలను పక్కనపెట్టి దేశం చాలా అభివృద్ధి జరిగిందని చెప్పడం దారుణమన్నారు. కార్మికులకు, స్కీమ్ ఉద్యోగులకు కనీస వేతనాలు, రైతులకు మద్దతు ధర, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు అందించకుండా అభివృద్ధి ఎలా జరిగిందో ప్రభుత్వాలను నిలదీయడానికి మహాధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 27, 28 తేదీల్లో విజయవాడలో జరగనున్న మహాధర్నా కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో రమణ, బేబీ, సుధ, వెంకటలక్ష్మి, సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

స్పందన 'కరువు'..!

- కరువు మండలాల ప్రకటనపై ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం
- జెడ్‌పి సర్వసభ్య సమావేశంలోనూ తీర్మానం చేయని పరిస్థితి
- ఎంపి, స్థానిక ప్రజాప్రతినిధులు లేవనెత్తినా పట్టించుకోని దుస్థితి
- 12 వేల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లు అధికారుల నివేదికలు
- దెబ్బతిన్న పంటలకు పరిహారం రానట్టే..!
- కేవలం బీమా మాత్రమే వర్తిస్తుందంటున్న అధికారులు
- అగమ్యగోచరంగా రైతుల పరిస్థితి



చింతలపూడి మండలంలో వర్షాభావంతో ఎండిపోయిన వరిపైరు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

వర్షాభావ పరిస్థితులతో తీవ్ర దుర్భిక్షంగా మారిన కరువు మండలాల ప్రకటనలో ప్రభుత్వం నుంచి స్పందన కరువైంది. ఆయా మండలాల గుర్తింపులో మొండిచెయ్యి అవలంభిస్తోంది. జిల్లా అధికారులు సైతం అదేవిధంగా వ్యవహరిస్తుండటంతో పంటలు దెబ్బతిన్న రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. శనివారం జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలోనూ కరువు మండలాలపై తీర్మానం చేయకపోవడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ఈ ఏడాది వర్షాలు నాలుగునెలల్లో మూడు నెలలు లోటు వర్షపాతం నమోదైంది. తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడటంతో మెట్ట ప్రాంతంలో పలు మండలాల్లో తీవ్రదుర్భిక్షం నెలకొంది. చింతలపూడి, చాట్రాయి, కామవరపుకోట, బుట్టాయగూడెంతోపాటు పలు మండలాల్లో పెద్దఎత్తున పంటలు దెబ్బతిన్నాయి. అధికారుల లెక్కల ప్రకారం ఏడుమండలాల్లోని 51 గ్రామాల్లో 75శాతం మేర పంట దెబ్బతినింది, 11 మండలాల్లోని 91 గ్రామాల్లో 8.065 ఎకరాల్లో పంట వడిలిపోయాయని తేల్చారు. దాదాపు 12వేల ఎకరాల్లో పైగా పంటలు దెబ్బతిన్నట్లు అధికారులు నివేదికలు చెబుతున్నాయి. రైతులు ఎకరాకు రూ.20వేలకు పైగా పెట్టుబడులు పెట్టి నష్టపోయారు. వరి, పత్తి రైతుల పరిస్థితి దారుణంగా మారింది. కష్టకాలంలో ఆదుకోవాల్సిన ప్రభుత్వం చేతులెత్తేసింది. కరువు మండలాల ప్రకటనలో జిల్లాలోని ఒక్క మండలానికి కూడా చోటు దక్కలేదు. జిల్లాలోని మంత్రులు, ఎంపీలు, ఎంఎల్ఎలు ప్రభుత్వంపై ఒత్తిడి తేవడంలో తీవ్రంగా విఫలమైన పరిస్థితి నెలకొంది. పంటలు దెబ్బతినడంతో పశుగ్రాసం లేకుండా పోయింది. బోర్లనుంచి నీరు సరిగా రావడం లేదు. ఉపాధిలేక బతుకుదెరువు కష్టంగా మారింది. రైతులు కూలీలుగా మారుతున్నారు. అయినప్పటికీ కరువు మండలాల గుర్తింపులో ప్రభుత్వం మాత్రం తాముపట్టిన కుందేలుకు మూడేకాళ్లు అన్నట్లు వ్యవహరిస్తోంది. కరువు మండలాలుగా ప్రకటించకపోవడంతో రైతులకు అందాల్సిన ప్రభుత్వ సాయం పూర్తిగా అందకుండా పోనుంది. రబీ సాగుకు రైతులకు పెట్టుబడి సొమ్ములు దొరకడం లేదు. తమది రైతు ప్రభుత్వమంటూ గొప్పలు చెప్పడం తప్ప కష్టకాలంలో పట్టించుకోవడం లేదు. ప్రభుత్వ తీరుతో రైతులకు ఏంచేయాలో అర్థంకాని పరిస్థితి ఏర్పడింది.

పంట నష్టపరిహారం ఇవ్వనట్టే

వర్షాభావం దెబ్బకు పంటలు దెబ్బతిన్నాయి. ప్రభుత్వం కరువు మండలాలుగా ప్రకటిస్తేనే పంట నష్టపరిహారం రైతులకు అందుతుంది. కానీ ప్రకటించలేదు. దీంతో రైతులకు పంట నష్టపరిహారం రానట్లేనని తేలిపోయింది. శనివారం జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్‌తోపాటు, పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు దెబ్బతిన్న పంటలకు సంబంధించి పరిహారంపై అడిగారు. అధికారులు చెప్పిన ప్రకారం చూస్తే బీమా మాత్రమే వచ్చే అవకాశం ఉందని, పంట నష్టపరిహారం వచ్చే అవకాశం లేనట్లేనని చెప్పారు. తాము ప్రభుత్వానికి నివేదించామని చెప్పి ముగించారు. బీమా కూడా ఎప్పుడొస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. కళ్లముందు పంటలు దెబ్బతిన్నా పంట నష్టపరిహారం ఇవ్వకపోవడం ఏమిటో ఏ ఒక్కరికీ అర్థం కావడం లేదు. ఎంపీ, ఎంఎల్ఎలు, జిల్లా అధికారులు పరిశీలించి పంటలు దెబ్బతిన్నట్లు తేల్చినా కరువు మండలాలుగా ప్రకటించకపోవడం చూస్తే రైతుల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఏపాటిదో అర్థంచేసుకోవచ్చు. ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

విద్యారంగం అభివృద్ధిపై..

శ్వేతపత్రం విడుదల చేయాలి

యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

మాట్లాడుతున్న ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తామని, అన్ని సౌకర్యాలతో పాఠశాలలను తీర్చిదిద్దుతామని, వేల కోట్ల రూపాయలు విద్యారంగం కోసం ఖర్చు పెడతామని చెప్పిన ప్రభుత్వం నాలుగున్నరేళ్లలో ఎంత మంది విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిందో, ఎంతమంది ప్రభుత్వ ఉపాధ్యాయుల నియామకాలు జరిగాయో శ్వేతపత్రం విడుదల చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. పశ్చిమగోదావరి జిల్లా యుటిఎఫ్ 49వ కౌన్సిల్ సమావేశం యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు విజయరామరాజు అధ్యక్షతన వైఎన్ కళాశాలలో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఒక పాఠశాల కూడా మూసివేయలేదని, ఏ ఒక్క ఉపాధ్యాయుడినీ తొలగించలేదని ప్రభుత్వం చెబుతోందని, 4600 పాఠశాలల్లోని 3, 4, 5 తరగతులను విలీనం చేయడం వల్ల నాణ్యమైన విద్య ఎక్కడ అందిందో చెప్పాలని డిమాండ్ చేశారు. 14 వేల ప్రాథమిక పాఠశాలల్లో ఏకోపాధ్యాయులు ఉన్నది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఇక్కడ చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందే అవకాశం ఉందా అని ప్రభుత్వమే చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రమోషన్లు ఇచ్చేశామని ప్రభుత్వం గొప్పగా చెబుతోందని, ప్రతి ప్రమోషన్‌కూ ఎన్ని ఎస్‌జిటి పోస్టులు రద్దు చేశారో శ్వేతపత్రం విడుదల చేయాలని కోరారు. పాఠశాలల పర్యవేక్షణ పేరుతో అధికారులు తిరగడం ద్వారా ప్రభుత్వ పాఠశాలల పట్ల తల్లిదండ్రులకు నమ్మకాన్ని పెంచిందా, తగ్గించిందా అని సమీక్షించుకోకుండా పర్యవేక్షణ పేరుతో విద్యారంగాన్ని బలహీనపర్చడం, ఉపాధ్యాయులను మానసిక వేధింపులకు గురిచేయడం సరికాదని విమర్శించారు. జిఒ 117 వల్ల పాఠశాల విద్యావ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందన్నారు. ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పాలకులు కార్పొరేట్ సంస్థల లాభాల కోసం ఉద్యోగ, ఉపాధ్యాయుల పెన్షన్ రద్దు చేసిందన్నారు. పాలకులు ఉద్యోగ, ఉపాధ్యాయుల పక్షమో లేక కార్పొరేట్ల పక్షమో తేల్చుకోవాలన్నారు. సిఎం జగన్మోహన్‌రెడ్డి ప్రతిపక్షంలో ఉండగా వారంలో సిపిఎస్ రద్దు చేస్తానన్న హామీ నాలుగున్నరేళ్లయినా నెరవేరకపోగా సిపిఎస్ కంటే ఘోరమైన జిపిఎస్ అమలు చేస్తున్నామని ప్రభుత్వం గారడీ చేస్తోందని విమర్శించారు. చట్టం చేసినంత మాత్రాన పోరాటాలు ఆపాల్సిన అవసరం లేదని తెలిపారు. నల్ల చట్టాల రద్దుకు రైతులు చేసిన పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకుని సిపిఎస్, జిపిఎస్ రద్దుకు పోరాడాలని పిలుపునిచ్చారు. యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రభుత్వం పిఆర్‌సి, డిఎ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పిఎఫ్, ఎపిజిఎల్ఐ లోన్లు ఫైనల్ సెటిల్‌మెంట్లు క్లియర్ చేయాలని, 12వ పిఆర్‌సికి సంబంధించి ఇంటీరియల్ రిలీఫ్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంఎల్‌సి షేక్ సాబ్జీ మాట్లాడారు. సమావేశంలో యూనియన్ నాయకులు పొదిలి కృష్ణమూర్తి, వలవల శ్రీరామ్మూర్తి, సిఐటియు నాయకులు కె.రాజా రామ్మోహన్ రాయ్, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.శుభాషిణి, ఏలూరు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ముస్తఫాఅలీ, ఆర్.రవికుమార్, పశ్చిమ గోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎకెవి.రామభద్రం, జిల్లా గౌరవ అధ్యక్షులు ఎం.మార్కండేయులు, సహాధ్యక్షులు కె.రాజశేఖర్, సహాధ్యక్షురాలు కె.శ్రీదేవి, జిల్లా కోశాధికారి సిహెచ్.పట్టాభిరామయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మళ్లీ రోడ్డెక్కిన గరగపర్రు బాధితులు

సమస్యలు పరిష్కరించాలని దళితుల నిరసన

డిమాండ్లు పరిష్కరించకుండా అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరిస్తే ఊరుకునేది లేదని స్పష్టం

ప్రజాశక్తి - పాలకోడేరు

నిరసన తెలుపుతున్న గరగపర్రు సాంఘిక బహిష్కరణ దళిత బాధితులు

గరగపర్రులో సాంఘిక బహిష్కరణకు గురైన దళిత బాధితులు మరోసారి రోడ్డెక్కారు. తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నిరసన తెలిపారు. సాంఘిక బహిష్కరణకు గురైన తమకు రాజ్యాంగం ప్రకారం రావాల్సిన నష్టపరిహారం పూర్తిస్థాయిలో అందించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం పాత పంచాయతీ భవనం వద్ద నిరసన తెలిపారు. దళితులు భారీ సంఖ్యలో పాల్గొని అంబేద్కర్‌కు నివాళులర్పించి ప్రభుత్వం, అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బహిష్కరణ దళిత బాధిత నాయకులు మాట్లాడారు. 2017లో టిడిపి హయాంలో సాంఘిక బహిష్కరణకు గురయ్యారని తెలిపారు. ఆ సమయంలో కేవలం 262 కుటుంబాలకు రూ.లక్ష చొప్పున ప్రభుత్వం అందించి చేతులు దులుపుకుందని చెప్పారు. ఈ నేపథ్యంలో ప్రముఖ దళిత నేత డాక్టర్ గొల్లమూడి రాజా సుందరబాబు తమకు అండగా నిలబడ్డారన్నారు. ప్రభుత్వం, కోర్టుతో న్యాయ పోరాటం చేసి 500 మందికి ఒక్కొక్కరికీ రూ.లక్ష చొప్పున సాధించామని తెలిపారు. మిగిలిన సమస్యల పరిష్కారానికి శాసనమండలి ఛైర్మన్ మోషన్‌రాజు, అప్పటి మంత్రి రంగనాథరాజు, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్‌పిలు కాగితం రూపంలో హామీ ఇచ్చారని తెలిపారు. సుమారు ఐదేళ్లు గడుస్తున్నా ప్రభుత్వ పెద్దలు, అధికారుల హామీలు ఏ ఒక్కటీ అమలు కాలేదని విమర్శించారు. ప్రతి కుటుంబానికీ మూడెకరాల వ్యవసాయ భూమిని అందించాలని డిమాండ్ చేశారు. మిగిలిన 106 మందికి నష్టపరిహారం అందించాలన్నారు. డిమాండ్లు పరిష్కరించాకే అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించాలని స్పష్టం చేశారు. లేనిపక్షంలో చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు.

వెంకటరత్నం టిడిపిలో చేరడం హాస్యాస్పదం

గరగపర్రు ఆత్మగౌరవ పోరాట నాయకుడునని చెప్పుకుంటున్న సిరంగుల వెంకటరత్నం టిడిపిలో చేరడం హాస్యాస్పదంగా ఉందని సాంఘిక బహిష్కరణ దళిత బాధిత నాయకులు విమర్శించారు. అప్పటి టిడిపి హయాంలోనే బహిష్కరణకు గురి కావడం జరిగిందని ఈ కేసులో ముద్దాయిలుగా టిడిపి నాయకులు ఉంటే వెంకటరత్నం టిడిపిలో ఎలా చేరారని ప్రశ్నించారు. ముద్దాయిలతో వెంకటరత్నం కొమ్ముక్కవ్వడంతో మోసం బయటపడిందని తెలిపారు. బాధిత దళితులకు వెంకటరత్నానికి ఎటువంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. దీనిపై సోమవారం జిల్లా స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, ఎస్‌పికి ఫిర్యాదు చేయనున్నట్లు దళిత బాధితుల కమిటీ నాయకులు తెలిపారు.

ఆరోపణలన్నీ అవాస్తవం : వెంకటరత్నం

తనపై చేస్తున్న ఆరోపణలన్నీ అవాస్తవమని గరగపర్రు ఆత్మగౌరవ పోరాట నాయకులు సిరింగుల వెంకటరత్నం ఖండించారు. ప్రజాశక్తితో ఆదివారం ఆయన మాట్లాడారు. ప్రస్తుతం తనపై ఆరోపణలు చేస్తున్న వారంతా గరగపర్రు ఉద్యమంలో లేరన్నారు. ఎన్నో కేసులు బనాయించినప్పటికీ ప్రాణాలకు తెగించి ఉద్యమాన్ని ముందుండి నడిపించానన్నారు. ఇటీవల బాధితులతో విజయవాడ కూడా వెళ్లి అప్పటి సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి నక్క ఆనందబాబుకు సమస్యలు వివరించినట్లు తెలిపారు. అప్పటి నుంచి ఉద్యమాన్ని వదలకుండా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తున్నానన్నారు. తనను రాజకీయంగా దెబ్బతీసేందుకు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని స్పష్టం చేశారు.

సచివాలయాలతోనే గ్రామ స్వరాజ్యం

మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు

సచివాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి కారుమూరి

ఉండి: సచివాలయాలతోనే గ్రామ స్వరాజ్యం సాధ్యమని మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం ఉనుదుర్రు గ్రామంలో రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయాన్ని రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ప్రారంభించారు. గ్రామ సచివాలయం నూతన భవనాన్ని పరిశీలించి ఎంతమంది సిబ్బంది పనిచేస్తున్నారు, ఏమైనా ఖాళీలు ఉన్నాయా అని మంత్రి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మా గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యమే నేడు గ్రామ సచివాలయాలన్నారు. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా ముఖ్యమంత్రి పాలన చేస్తున్నారన్నారు. ఈ ప్రభుత్వంలో అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలను గత ప్రభుత్వాలలో ఎన్నడూ జరగలేదన్నారు. మన రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకునేందుకు ఆలోచనలు చేస్తున్నారని అన్నారు. ప్రజలు నాలుగున్నర సంవత్సరాల కాలంలో చేసిన ప్రగతిని గమనించాలన్నారు. లబ్ధిదారులకు పథకాలు అందించే కార్యక్రమంలో సిబ్బంది నిమగ్నమై ఉండాలన్నారు. ఎక్కడా ఒక్క చిన్న ఫిర్యాదు రాకుండా చక్కని సేవలందించి, ఆదర్శ సచివాలయాలుగా తీర్చి దిద్దుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు, పంచాయతీరాజ్ డిఇ కె.శ్రీనివాసరావు, ఇఒపిఆర్‌డి కె.గోపాలకృష్ణ, ఎంపిపి ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు, ఎఎంసి ఛైర్మన్ బొక్కా వెంకటేశ్వర్లు, గ్రామ సర్పంచి పిన్నమరాజు నాగలక్ష్మి పాల్గొన్నారు.

నిబంధనలు గాలికి..!

కొమరాడలో అనుమతుల్లేకుండా లేవుట్లు

హెచ్చరిక బోర్డు తొలగింపు

అధికారుల అండ ఉందంటూ విమర్శలు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

అధికార బలంతోపాటు అధికారుల అండదండలుంటే చాలు నిబంధనలతో పనిలేదనడానికి భీమవరంలోని కొమరాడ లేఅవుటే నిదర్శనం. భూ మార్పిడి సొమ్ము చెల్లించి అదేదో సర్వ హక్కులు పొందినట్లుగా సదరు నిర్వాహకులు వ్యవహరిస్తున్నారు. సాక్ష్యాత్తూ పంచాయతీ ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు సైతం నిర్వాహకులు తొలగించినా స్థానిక యంత్రాంగం చేష్టలూడి ఉండిపోతున్నారని పలువురు విమర్శిస్తున్నారు. ఈ వ్యవహారంలో భారీ ఎత్తున సొమ్ములు చేతులు మారినట్లుగా ప్రచారం సాగుతోంది.

అనుమతులు లేకుండా వేసిన లేఅవుట్

వివరాల్లోకి వెళితే జిల్లా కేంద్రమైన భీమవరం పట్టణానికి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న కొమరాడ గ్రామ పంచాయతీ పరిధిలో మూడెకరాల విస్తీర్ణంలో లేఅవుట్ ఏర్పాటు చేశారు. దీనికి పంచాయతీ నుంచి ఎటువంటి అనుమతులూ పొందలేదు. ఇవేమీ లేకుండానే అమ్మకాలు చేపట్టడంతో పంచాయతీ యంత్రాంగం హెచ్చరిక బోర్డును సదరు లేఅవుట్లో ఏర్పాటు చేసింది. అనుమతులు లేకుండా నిర్మించిన లేఅవుట్లలో అక్రమ నిర్మాణాలు చేయరాదని, ఉడా నుంచి అనుమతులు పొంది నిర్మాణాలు చేసుకోవాలని అందులో సూచించింది. దీన్ని ఉల్లంఘిస్తే సదరు యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, లేఅవుట్లో మౌలిక వసతులు కల్పించడం జరగదని పేర్కొన్నారు. కాని ఈ బోర్డును నిర్వాహకులు ఏర్పాటు చేసిన రోజునే తొలగించి పక్కన పడేశారు. ఇదేమీ తెలియని కొందరు ఆయా లేఅవుట్ స్థలాలను కొనుగోలు చేస్తున్నారు. జిల్లా కేంద్రంగా భీమవరం ఏర్పడిన తర్వాత చుట్టుపక్కల ప్రాంతాల భూములకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. ఈ తరుణంలో సమీప ప్రాంతాల్లో ఎక్కువగా స్థలాలు కొనుగోలు చేస్తున్నారు. అయితే ఎక్కువ శాతం ఎటువంటి అనుమతులు లేనివి కొనుగోలు చేసి మోసపోతున్నారు. ఈ విషయాల్లో కఠినంగా వ్యవహరించాల్సిన యంత్రాంగం చోద్యం చూస్తోంది. ఏకంగా హెచ్చరిక బోర్డు తొలగించేసినా పంచాయతీ కార్యదర్శి మౌనం దాల్చడం వెనుక పలు ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. బడా వ్యక్తుల బలంతో అధికారులు ఇటువంటి చర్యలకు ఉపక్రమించకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల జిల్లా కలెక్టర్ సైతం అనుమతులు లేని లేఅవుట్లు గుర్తించాలని ఆదేశాలు ఇచ్చిన నేపథ్యంలో ఎటువంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే.

సముద్ర స్నానాలు చేస్తున్న పర్యాటకులు

బీచ్ వద్ద పర్యాటకుల సందడి

అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు

ప్రజాశక్తి - మొగల్తూరు

బీచ్ వద్ద ఏర్పాటు చేసిన పోలీస్ అవుట్ పోస్ట్

మండలంలోని పేరుపాలెం బీచ్ వద్ద పర్యాటకుల సందడి ప్రారంభమైంది. కార్తీక మాసం మొదటి ఆదివారం కావడంతో పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు అధిక సంఖ్యలో బీచ్‌కు తరలివచ్చి ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆహ్లాదంగా గడిపారు. సముద్ర స్నానాలు చేశారు. చిన్నారులు ఇసుక తేనెలపై ఆటలాడుకున్నారు. బంధుమిత్రులతో కలిసి వచ్చి సహపంక్తి భోజనాలు చేశారు. బీచ్‌లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. పోలీస్, ఆరోగ్య శాఖ, పంచాయతీ, అగ్నిమాపక శాఖ సిబ్బంది విధులు నిర్వహించారు.

బీచ్ వద్ద ఏర్పాట్లు..

బీచ్ వద్ద పర్యాటకులు ప్రమాదాల బారిన పడకుండా మండల పరిషత్ ఆధ్వర్యంలో బారిగేడ్లు ఏర్పాటు చేశారు. పోలీస్ అవుట్ పోస్ట్, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది కూర్చునేందుకు పందిళ్లు, మహిళలు దుస్తులు మార్చుకునేందుకు ఏర్పాట్లు చేశారు. బీచ్‌లో పారిశుధ్య మెరుగుకు పంచాయతీ ఆధ్వర్యంలో చర్యలు చేపట్టారు.

భారీ స్క్రీన్లలో క్రికెట్ వీక్షణ

ప్రజాశక్తి - పాలకొల్లు

పట్టణంలోని గాంధీ బొమ్మల సెంటర్లో భారత్ ఆస్ట్రేలియా మధ్య జరుగుతున్న ప్రపంచ కప్ ఫైనల్ మ్యాచ్ చూసేందుకు ఆదివారం భారీ ఎల్ఇడి స్క్రీన్ ఏర్పాటు చేశారు. అయితే భారత్ త్వరితగతిన 3 వికెట్లు కోల్పోయిన నేపథ్యంలో యువత నిరాశ పడింది. భారత్ గెలవాలని యువత కోరుతున్నారు.

పెనుమంట్ర : ఇండియా, ఆస్ట్రేలియా మధ్య జరిగే క్రికెట్ మ్యాచ్‌ను బహిరంగ ప్రదేశాల్లో స్క్రీన్ ఏర్పాటు చేసిన చూశారు. బెట్టింగులు నిర్వహిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపారు. మార్టేరు, ఆలమూరు, బ్రాహ్మణచెరువు, పొలమూరు, మల్లిపూడి, సోమరాజు ఇల్లింద్రపర్రులో నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఆచంట : భారత్, ఆస్ట్రేలియా మధ్య జరుగుతున్న వరల్డ్ కప్ మ్యాచ్‌ను చూసేందుకు ప్రజలంతా ఇళ్లల్లో టివిలకు అతుక్కుపోవడంతో ఆదివారం మండలంలో రహదారులన్నీ నిర్మానుష్యంగా మారాయి. ఆచంట వేమవరంలో కర్ని బత్తుల కళ్యాణ మండపంలో ఎల్‌డిఎల్ భారీ స్క్రీన్‌పై జనరేటర్ సహాయంతో వరల్డ్ కప్ మ్యాచ్‌ను క్రికెట్ అభిమానుల కోసం నిర్వాహకులు ఏర్పాటు చేశారు.

మొగల్తూరు : భారత్, ఆస్ట్రేలియా జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌ను వీక్షించేందుకు అభిమానులు ప్రత్యేక స్క్రీన్లు ఏర్పాటు చేశారు. మొగల్తూరులోని హైస్కూల్ వద్ద, ముక్కువారి వీధిలో ముత్యాలపల్లిలోని బండి ముత్యాలమ్మ ఆలయ మాజీ ఛైర్మన్ కొల్లాటి కనక సుబ్బారావు ద్వితీయ కుమారుడు వివాహ మండపంలో కూడా ప్రత్యేక స్క్రీన్ ఏర్పాటు చేశారు.

మొగల్తూరులో ఏర్పాటు చేసిన స్క్రీన్

నరసాపురంలో...

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం గ్రేడ్ వన్ గ్రంథాలయంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు పురస్కరించుకుని భారత తొలి మహిళా ప్రధాని ఇందిరాగాంధీ, ఝాన్సీలక్ష్మీబాయి జయంతి సందర్భంగా మహిళా దినోత్సవ్ వాన్ని దిశచట్టం మహిళా సాధికారతపై చర్చ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సభకు ప్రముఖ న్యాయవాది సంతోష్ కుమారి అధ్యక్షత వహించి దిశచట్టం, మహిళా సాధికారత గురించి, దిశ యాప్ వివరాలను వివరించారు. ముఖ్యఅతిథిగా రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ సత్యవతి, సెక్రటరీ అనసూయ పాల్గొని ఇందిరా గాంధీ జీవిత విశేషాలు గురించి వివరించారు. విశిష్ట అతిథులుగా లయన్ అల్లూరి నలినీదేవి, సెవెన్ ఆర్ట్స్ ట్రస్ట్ ఫౌండర్ రీటా, బీచర్ల నాగలక్ష్మి, శేషుకుమారి, నరేష్, పవన్ హాజరయ్యారు. అనంతరం దేశభక్తి గేయాలు పాటల పోటీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ప్రవీణ్, జీవన్, శ్రీనివాస్, గ్రంథాలయ పాఠకులు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు. వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు సోమవారం ముగింపు సభలో ఎంఎల్ఎ ప్రసాదరాజు చేతులమీదుగా బహుమతులు అందిస్తారని గ్రేడ్ వన్ లైబ్రేరియన్ కెజెఎస్ఎల్.కుమారి తెలిపారు.

పెనుమంట్ర : జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు భాగంగా ఆదివారం మార్టేరు శాఖ గ్రంథాలయంలో ఇందిరాగాంధీ జయంతిని నిర్వహించినట్లు గ్రంథాలయ అధికారి పి.టి.ఎస్.కుమార్ అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల ద్వారా కార్యాలలో శాఖ గ్రంథాలయంలో కవి సమ్మేళనం పుస్తకప్రదర్శన , విద్యార్థుల చేత చదవటం మా కిష్టం ప్రోగ్రామ్ నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మానవత అధ్యక్షులు బాబాల శ్రీనివాసరావు, రోటరీ సంస్థ అధ్యక్షులు గుడిమెట్ల లక్ష్మిరెడ్డి, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ గుడిమెట్ల రామారెడ్డి, ఆత్మీయ సహకార కమిటీ ఛైర్మన్ చిర్ల శ్రీనివాసరెడ్డి, చిర్ల సూర్యనారాయణరెడ్డి, రిటైర్డ్ తహశీల్దార్ ఎల్వి.సూర్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

సిపిఎస్ రద్దు హామీ నెరవేర్చాలి

ప్రజాశక్తి - నిడమర్రు

సిపిఎస్ రద్దు హామీని జగన్ ప్రభుత్వం నెరవేర్చాలని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి కె.కమల్‌కుమార్ డిమాండ్ చేశారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో ఆదివారం జరిగిన యుటిఎఫ్ కౌన్సిల్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశానికి ఎం.రామకృష్ణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు డిఎ ఇవ్వలేని స్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. సిపిఎస్ రద్దు విషయం ప్రభుత్వం మరిచిపోయిందన్నారు. వెంటనే ఉద్యోగులకు రివర్స్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం మండల నూతన కమిటీ అధ్యక్షులుగా ఎం.రామకృష్ణ, కార్యదర్శిగా మౌలాలి, గౌరవ అధ్యక్షులుగా ఎం.మధుసూదనరావు, కోశాధికారిగా డి.సత్యనారాయణ, జిల్లా కౌన్సిల్ సభ్యులుగా ఎండి ముస్సీర్‌బాష, బి.సత్యవాణిలతో నూతన కమిటీ ఏర్పడింది.

మున్సిపల్ మాజీ కౌన్సిలర్ రాంప్రసాద్ మృతి

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు మున్సిపల్ మాజీ కౌన్సిలర్, ప్రముఖ న్యాయవాది సొలాస రాంప్రసాద్ (70) ఆకస్మికంగా మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆయన ఆదివారం అస్వస్థతకు గురికాగా హైదరాబాద్‌కు తరలిస్తుండగా విజయవాడలో మృతి చెందారు. ఆయన ఉషారాణి మున్సిపల్ ఛైర్మన్‌గా ఉండగా టిడిపి కౌన్సిలర్‌గా పనిచేశారు. ఆయన మృతి పట్ల ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు, మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్, మాజీ ఎంఎల్‌యే డాక్టర్ బాబ్జి, బంగారు ఉషారాణి, ఛాంబర్ అధ్యక్షులు కారుమూరి నరసింహరావు సంతాపం తెలిపారు.

వనవులమ్మ ఆలయం పునఃప్రతిష్ఠ

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

మండలంలోని దిగమర్రులో గ్రామదేవత వనవులమ్మ ఆలయం పునఃప్రతిష్టాపన కార్యక్రమంలో వైసిపి మండల ఇన్‌ఛార్జి గుడాల గోపీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్తులు ఆయురారోగ్యాలతో, మరింత ఆనందంగా తీర్చిదిద్ది అమ్మవారి ఆశీస్సులు పొందుతారని ఆశిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి బోర్డు మెంబర్ మేకా శేషుబాబు, జెడ్‌పిటిసి సభ్యులు నడపన గోవిందరాజులు నాయుడు, ఎంపిపి చిట్టూరి కనకలక్ష్మి పాల్గొన్నారు.

యాత్రికులతో ముత్యాలమ్మ ఆలయం రద్దీ

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో ఉన్న బండి ముత్యాలమ్మ ఆలయం ఆదివారం యాత్రికులతో కళకళలాడింది. యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కానుకలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ కార్యనిర్వహణాధికారి దెందుకూరి రామకృష్ణంరాజు పర్యవేక్షణలో సిబ్బంది ఏర్పాటు చేశారు. ఆలయ ప్రాంగణంలో భజన కాలక్షేపం, ప్రసాద వితరణ సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

'జగన్‌కు గెలిచే సత్తా లేకే దొంగ ఓట్ల నమోదు'

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

సిఎం జగన్‌కు ప్రజాస్వామ్య పద్ధతిలో గెలిచే సత్తా లేదని తెలిసే వైసిపి శ్రేణులు దొంగ ఓట్ల నమోదు, టిడిపి జనసేన ఓట్లను తొలగించడం వంటి వాటికి పాల్పడుతున్నారని, వీటిపై బూత్ స్థాయిలో దృష్టి పెట్టాలని పాలకొల్లు ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు అన్నారు. మండలంలోని పూలపల్లిలో జరిగిన టిడిపి క్లస్టర్–6 సమావేశంలో ఆయన మాట్లాడారు. టిడిపి, జనసేన కూటమి అధికారంలోకి రాగానే అన్ని వర్గాల ప్రజలకు జరిగే మేలును ఇంటింటికీ తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్ మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్ రాక్షస పాలన అంతమొందించాలని ప్రజలు ఎదురు చూస్తున్నారని, రానున్న కాలంలో టిడిపి, జనసేన కూటమి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. టిడిపి పరిశీలకులు పెచ్చెట్టి చంద్రమౌళి, ఎంపిటి మాజీ ఛైర్మన్ గొట్టుముక్కల గాంధీ భగవాన్‌రాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి పెచ్చెట్టి చంద్రమౌళి, యూనిట్ ఇన్‌ఛార్జిస్ గొట్టుముక్కల గాంధీ భగవాన్‌రాజు, రాంబ ప్రసాద్, కౌరు మురళి, లంకలకోటేశ్వరరావు, సర్పంచ్ రజని, సెక్రటరీస్, సేవ మిత్ర సాధికార మిత్ర యువత కన్వీనర్ పాల్గొన్నారు.

దళిత సర్పంచులపై వివక్ష తగదు

ప్రజాశక్తి - గణపవరం

దళిత సర్పంచులపై అధికార పార్టీ ఎంఎల్ఎలు, ప్రజాప్రతినిధులు వ్యవహరిస్తున్న తీరు మార్చుకోవాలని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి కె.క్రాంతిబాబు హెచ్చరించారు. జల్లి కాకినాడ సర్పంచి కుల వివక్షకు గురవుతున్నారని సోషల్ మీడియాలో వస్తున్న పోస్టులకు స్పందించి శనివారం గణపవరం మండల కార్యదర్శి చిన్న నాగేశ్వరరావుతో కలిసి జల్లి కాకినాడ గ్రామంలో పలువురిని కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జల్లి కాకినాడలో అర్హత కలిగిన వారికి ఇళ్ల పట్టాలు ఇవ్వకుండా ఇళ్ల పట్టాలు పొందిన వారికే తిరిగి పట్టాలు ఇవ్వడం దారుణమన్నారు. ఈ విషయంపై ప్రశ్నించే గ్రామ సర్పంచి బాత నాగేశ్వరరావుపై ఉంగుటూరు ఎంఎల్ఎ అనుచరులు వాగ్వివాదానికి దిగడమే కాకుండా సర్పంచి ప్రమేయం లేకుండా పట్టాల పంపిణీ చేయడం కుల దురహంకారానికి నిదర్శనమన్నారు. ఇటీవల కాలంలో వీరవాసరం మండలం నవుడూరు గ్రామ దళిత మహిళా సర్పంచిని ఉపసర్పంచి బహిరంగంగా దూషించారన్నారు. ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ చట్టప్రకారం కేసు నమోదు చేసినా ఇప్పటివరకు పోలీసులు చర్య తీసుకోకపోవడం ఆశ్చర్యకర విషయమన్నారు. తక్షణం నవుడూరు ఉప సర్పంచి ముసింద్రారావుపై చర్యలు తీసుకోవాలని, లేకపోతే రాష్ట్రస్థాయిలో దళిత సర్పంచుల సమీకరణ ఉద్యమిస్తామని హెచ్చరించారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

మంచినీటి చెరువులో తూడు, గడ్డి

ఎంపిపి స్వగ్రామంలో దుస్థితి
నీటి కోసం పెదగరువు వాసుల వెతలు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఎంపిపి స్వగ్రామం పెదగరువులో మంచినీటి చెరువు తూడు, ఇతర గడ్డితో అధ్వాన్నంగా తయారైంది. సుమారు 1750 జనాభా కల్గిన గ్రామంలో మంచినీటి పథకాలు అత్యంత ఘోరంగా తయ్యారయ్యాయి. ప్రజల కనీస అవసరాలైన సురక్షిత మంచినీటిని సైతం అందించలేని దుస్థితిలో పంచాయతీ కొనసాగుతుంది. చెరువుతో పాటు ఫిల్టర్‌బెడ్లు సైతం నిర్వహణ లేకపోవడంతో నాచు, ఇతర చెత్తాచెదారం దర్శనమిస్తుంది. ఈ పరిస్థితుల్లో గ్రామస్తులు ప్రయివేట్ సంస్థల నీటిని కొనుగోలు చేసుకుని వినియోగించుకుంటున్నారు. అది సుమారు ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న వెంప గ్రామం వెళ్లి నీటిని కొనుగోలు చేసుకుని తెచ్చుకుంటున్నారు. గ్రామంలో నీటిని కేవలం ఇంటి అవసరాలకే వాడుతున్నారు. కనీసం స్నానం చేసినా చర్మవ్యాధుల బారిన పడి ఆసుపత్రుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి తమ గ్రామానికి సురక్షిత మంచినీరు అందిచే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

గడ్డి తూడుతో నిండిన మంచినీటి చెరువు

విద్యా వ్యవస్థను కాపాడుకోవాలి

ప్రజాశక్తి - గణపవరం

విద్యా వ్యవస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపైనా ఉందని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి రత్నంరాజుశివప్రసాద్ అన్నారు. పిప్పర హైస్కూల్లో శనివారం రాత్రి నిర్వహించిన యుటిఎఫ్ గణపవరం మండల కౌన్సిల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశానికి జాలేం నాని అధ్యక్షత వహించారు. శివప్రసాద్‌రత్నంరాజు మాట్లాడుతూ ఇంగ్లీషు, తెలుగు మీడియం సబ్జెక్టులకు ప్రభుత్వం ఉపాధ్యాయులను నియమించాలన్నారు. ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థులు ప్రయివేట్ పాఠశాలలకు వెళ్లే అవకాశం కలుగుతుందన్నారు. ప్రాథమిక విద్య నుంచి ప్రభుత్వం తప్పించుకోవాలని చూస్తుందన్నారు. మండల కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు కార్యదర్శి నివేదిక ప్రవేశపెట్టిన అనంతరం నివేదకను ఏకగ్రీవంగా సమావేశం ఆమెదించింది. అనంతరం నూతన కార్యవర్గం ఏర్పడింది. యుటిఎఫ్ గణపవరం మండల నూతన అధ్యక్షులుగా జాలేంనాని, ప్రధాన కార్యదర్శిగా జి.దుర్గాభవాని ప్రసాద్, గౌరవఅధ్యక్షులుగా మామిడిశెట్టి పెద్దిరాజు, కోశాధికారిగా శర్మ అసోసియేట్ సభ్యులుగా అపర్ణ ఎన్నికయ్యారు.

4న ఢిల్లీలో ధర్నాను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - పెనుమంట్ర

దళితుల సామాజిక హక్కులు, ఆర్థిక, భూ సమస్యల పరిష్కారం కోసం డిసెంబర్ నాలుగో తేదీన న్యూఢిల్లీలో జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు బత్తుల విజయకుమార్ పిలుపునిచ్చారు. కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్), వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన డిసెంబర్ 4న చలో ఢిల్లీ కార్యక్రమంలో భాగంగా జుత్తిగలో శనివారం రాత్రి ఇంటింటికి కెవిపిఎస్ మండల అధ్యక్షులు కె.కృష్ణ అధ్యక్షతన సంతకాల సేకరణ జరిగింది. ఈ సందర్భంగా కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా అధ్యక్షులు బత్తుల విజయకుమార్ మాట్లాడుతూ 75 ఏళ్ల స్వతంత్ర భారతదేశంలో నేటికీ దళితులపై దాడులు, అత్యాచారాలు కొనసాగుతూనే ఉన్నాయన్నారు. కేంద్రంలో బిజెపి రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత తన మనువాద మతోన్మాద విధానాలను శరవేగంగా అమలు చేస్తుందన్నారు. బిజెపి సబ్‌ప్లాన్ చట్టాన్ని రద్దు చేసిందని, రిజర్వేషన్లు అమలు చేయకుండా తీసివేయడానికి అనేక ప్రయత్నాలు చేస్తుందన్నారు. మణిపూర్‌లో మనువాదుల చేతుల్లో ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించి అత్యాచారం చేయడం యావత్ భారతదేశాన్ని తలదించుకునేలా చేసినా ప్రధానమంత్రి మోడీ మాట్లాడకపోవడం దారుణమన్నారు. మన రాష్ట్రంలో కూడా రోజురోజుకు దళితులపై దాడులు పెరుగుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో దళితుల హక్కులు, సామాజిక ఆర్థిక భూ సమస్యల పరిష్కారం కోసం ఢిల్లీలో డిసెంబర్ 4వ తేదీన భారీ ధర్నాను చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో సూరిరావు, కె.అరుణ్ కుమార్, వెంకట్రావు పాల్గొన్నారు.

రహదారి నిర్మించాలని నిరసన

ప్రజాశక్తి - ఆచంట

ఆచంట నుంచి ఆచంట వేమవరం వెళ్లే రహదారి పూర్తిగా అధ్వాన స్థితికి చేరుకుందని, తక్షణమే రహదారి నిర్మించాలని టిడిపి మండలాధ్యక్షులు కేతా మీరయ్య డిమాండ్ చేశారు. జనసేన, టిడిపి ఉమ్మడి సారధ్యంలో గుంతల రోడ్డుకు దారేది కార్యక్రమం ద్వారా ఆచంట మండలం ఆచంట గ్రామం వేమవరం వెళ్లే రోడ్డు దుస్థితిని ప్రభుత్వానికి తెలియజేసేలా ఇరు పార్టీల కార్యకర్తలు నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రెసిడెంట్, జవ్వాది బాలాజీ, కేతా మీరయ్య, ఎంపిపి సూర్యకుమారి, వైస్ ఎంపిపి ఎర్రగుప్పుల నాగరాజు, నెక్కంటి ప్రభాకర్, నంబూరు విజయ్, కేతా మురళి పాల్గొన్నారు.

ఆదర్శప్రాయులు ఝాన్సీ లక్ష్మీబాయి

ప్రజాశక్తి - పాలకొల్లు

పట్టణంలోని జివిఎస్‌విఆర్ఎం మున్సిపల్ పాఠశాలలో వీరనారి ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం రాయపూడి భవానీప్రసాద్ మాట్లాడుతూ ఝాన్సీలక్ష్మీబాయి జయంతిని స్త్రీ శక్తి దివాస్‌గా జరుపుకుంటామన్నారు. పుట్టిన నేల కోసం కత్తి పట్టి పోరాడిన ధీర వనిత లక్ష్మీబాయి అని, ఎందరో మహిళలు స్వాతంత్ర సంగ్రామంలో పాల్గొనేందుకు మార్గం చూపిన వనిత అని చెప్పారు. నేటి వనితలు ఝాన్సీని ఆదర్శంగా తీసుకుని ధైర్యం, సాహసం, దేశభక్తితో ముందుకు సాగి భారత్ కీర్తి ప్రతిష్ఠలను ప్రపంచానికి తెలియజేయాలని కోరారు. ఝాన్సీలక్ష్మీబాయి వేషధారణలో విద్యార్థిని ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు బి.త్రిమూర్తులు, బొక్క భవానిదుర్గ, శశికళ, చంద్రకళ పాల్గొన్నారు.

మున్సిపల్ స్కూల్లో ఝాన్సీలక్ష్మీబాయి జయంతి వేడుకలు

ఘనంగా ఇందిరాగాంధీ జయంతి వేడుకలు



ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ విగ్రహాలకు నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - ఉండి

భారత మాజీ ప్రధాని, ఉక్కు మహిళ ఇందిరాగాంధీ 107వ జయంతి వేడుకలను ఉండి పెద్ద వంతెన సెంటర్‌లోని కాంగ్రెస్ స్తూపం వద్ద ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ విగ్రహాలకు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వేగేశ్న వెంకట గోపాలకృష్ణంరాజు, జంపన సూర్యనారాయణరాజు, సోడదాసి గంగయ్య పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి పేదవాని సొంతింటి కలలు నెరవేర్చిన ఘనత ఇందిరాగాంధీకే దక్కిందన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించిన ఆమె తొలి భారత మహిళా ప్రధాని అయ్యారన్నారు. బ్రిటిష్ వారిని ఎదిరించి ధైర్య సాహసాలు ప్రదర్శించడంతో ఉక్కు మహిళగా కీర్తింపబడ్డారని తెలిపారు. అనంతరం వృద్ధులకు, మహిళలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు వారాడ కొండలరావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అడబాల శ్రీనివాస్, చింతా ఆదిశేషు, కొండా రాజేష్ కుమార్, సోము అప్పలరాజు, ఈదా దానియేలు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం

భయాందోళనలో స్థానికులు

ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభం

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

మండలంలోని నిడదవోలు ప్రధాన కాలువపై పెద్ద సాయిబాబా ఆలయం రోడ్డులో పెంకుళ్లపాలెం వద్ద 16 కెవి లైన్‌కు వేసిన విద్యుత్ స్తంభం కింద పగిలిపోయి కూలిపోవడానికి సిద్ధంగా ఉంది. దీంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఏ క్షణాన ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ శాఖ వారు స్పందించి ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని పెంకుళ్లపాలెం వాసులు కోరుతున్నారు.

కానరాని కార్తీకమాసం సందడి

ప్రజాశక్తి - పెనుమంట్ర

కార్తీక మాసం ఆరంభంలో కళ్యాణ మండపంలో సందడి సన్నగిల్లింది. కార్తీక మాస వనభోజన, పిక్‌నిక్ పేరుతో యువకులు చేసే సందడి మండలంలో ఇంకా ఆరంభం కాలేదు. కార్తీక మాసంలో ముఖ్యమైన ప్రాంతాలైన మార్టేరు ఆర్యవైశ్య కళ్యాణ మండపం, మార్టేరు రెడ్డి కళ్యాణ మండపం, నెగ్గిపూడిలో ఎస్‌విజిహెచ్ ఆడిటోరియం, హైస్కూల్ మైదానం, ఆలమూరులో కమ్యూనిటీ హాలు, పెనుమంట్రలో కనకదుర్గమ్మ ఆలయ ప్రాంగణం, నత్తా రామేశ్వరం, జుత్తిగలో శైవ క్షేత్రాలు వంటి ప్రాంతాల్లో కార్తీక మాసం వన భోజన సందడి మొదలు కాలేదు. ఈ సమయంలో విద్యార్థులు సైతం పిక్‌నిక్ పేరుతో తమ ఉపాధ్యాయులతో పాటు కార్తీక మాస సందడి చేసుకునేవారు. కార్తీక మాసం పేరుతో సంగీత విభావరి, యాంకర్లకు, బేకరీ సెంటర్లకు, హోటల్స్‌లకు, ఫొటోగ్రాఫర్లకు, పండ్ల దుకాణాలకు, పూల దుకాణాలకు మంచి గిరాకీ ఉంటుంది. ప్రస్తుతం కార్తీక మాస సందడి మొదలు కాకపోవడంతో కళ్యాణ మండపంలో సందడి సన్నగిల్లింది.

మార్టేరు రెడ్డి కళ్యాణ మండపం

ఘనంగా బొమ్మిడి నాయకర్ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

జనసేన పార్టీ నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొమ్మిడి నాయకర్ పుట్టినరోజు వేడుకల్లో భాగంగా వేములదీవి వెస్ట్ గ్రామం జనసేన నాయకులు, కార్యకర్తలు, జనసైనికులు, వీర మహిళలు 50 కేజీల కేక్ కట్ చేయించి ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంతటి అభిమానాన్ని చూపిస్తున్న ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి ఒడుగు యేసు పాల్గొన్నారు.

కొవ్వలి ఆధ్వర్యంలో కాపు వన సమారాధన

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

నరసాపురంలో రూ.1.50 కోట్ల విరాళంతో తెలగా కళ్యాణ మండపాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడంతో పాటు కార్తీకమాసం సందర్భంగా తెలగా, కాపు కార్తీక సమారాధనకు పూర్తి ఆర్థికసాయం అందించిన కొవ్వలి ఫౌండేషన్ ఛైర్మన్ కొవ్వలి యతిరాజ రామ్మోహన్ నాయుడును కాపు సామాజిక తరగతికి చెందిన ప్రజా ప్రతినిధులు, కాపు సంఘం నాయకులు ఘనంగా సత్కరించారు. కళ్యాణ మండపంలో పలు విభాగాలను ఎంఎల్ఎ డాక్టర్ నిమ్మల రామానాయుడు, మాజీ ప్రజా ప్రతినిధులు నిమ్మకాయల చినరాజప్ప, కొత్తపల్లి సుబ్బారాయుడు, తోట సీతరామలక్ష్మి ప్రారంభించి రామ్మోహన్ నాయుడు సేవలను కొనియాడారు.

మోడీది తిరోగమన పాలన

ప్రజాశక్తి - భీమవరం

దేశంలో మోడీ ప్రభుత్వం తిరోగమన పాలన చేస్తుందని, రానున్న రోజుల్లో దీనిని తిప్పికొట్టాలని ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పివి.సుందరరామరాజు అన్నారు. ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ కార్యాలయంలో జిల్లా సమితి, జనరల్ బాడీ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుందరరామరాజు మాట్లాడుతూ, జిల్లా ప్రధాన కార్యదర్శి లంక కృష్ణమూర్తి మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని రకాల నిత్యావసర ధరలు, పెట్రోల్, గ్యాస్ ధరలు కూడా పెరిగాయన్నారు. సామాన్యుడు బతకడం భారంగా మారిందని, ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని చెప్పారు. అనంతరం భీమవరం డివిజన్ కార్యదర్శి దండు శ్రీనివాసరాజును, తాడేపల్లిగూడెం డివిజన్ కార్యదర్శిగా బిహెచ్ఎన్‌వి. రామకృష్ణను మహాసభలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో కనుమూరి వెంకటపతిరాజు, కొత్తపల్లి సుబ్బరాజు, నడింపల్లి. అరుణావరాజు, నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కల్యాణ మండపానికి రూ.50 లక్షల విరాళం

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు నియోజకవర్గ గౌడ్, శెట్టిబలిజ కళ్యాణ మండపంలో గౌడ, శెట్టి బలిజ, ఈడిగా, శ్రీశయన, యాతం, సంఘీయుల కార్తీక వన సమారాధన కార్యక్రమంలో అతిరథమహారధులు పాల్గొన్నారు. పార్టీల బేధం లేకుండా ఐక్యంగా ఉండాలని అన్ని పార్టీల నేతలు కోరారు. సంఘ భవనానికి మాజీమంత్రి పితాని సత్యనారాయణ రూ.50 లక్షల విరాళం ప్రకటించారు. ఈ సమావేశంలో ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు, మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్, వైసిపి పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల గోపీ, మేకా శేషుబాబు, గుబ్బల తమ్మయ్య, సాకా సత్యనారాయణ, వెంకటస్వామి, మేకా కోటేశ్వరరావు, మామిడిశెట్టి పెద్దిరాజు, జోగి వెంకటేశ్వరరావు, కాగిత సూర్యనారాయణ పాల్గొన్నారు.

విచ్చలవిడిగా ఆక్వా చెరువులకు బోర్లు

ఉప్పునీటి ముప్పు
పంట కాల్వలు, తాగునీటి చెరువులు కలుషితం
చౌడు బారుతున్న పంట చేలు
పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - కాళ్ల

భూగర్భానికి అక్రమార్కులు తూట్లు పెడుతున్నారు. బోర్లు వేసి యథేచ్ఛగా జలాలను తోడేస్తున్నారు. అనుమతులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా భూగర్భ జలాలను తోడేస్తున్నారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. ఒకప్పుడు పచ్చని పంట పొలాలతో కళకళలాడిన డెల్టా ప్రాంతం ఆక్వా చెరువుల ప్రభావంతో ఉప్పుకయ్యగా మారుతోంది. వరి పండించే భూములకు సమీపంలో రొయ్యల చెరువులు వెలిశాయి. రొయ్యల సాగు కోసం అక్రమంగా ఉప్పునీటి బోర్లు తవ్వేస్తున్నారు. వీటి ప్రభావంగా వరి పండే భూములు చౌడు బారి రైతులు నష్టపోతున్నారు. తాగునీరు కలుషితమై ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా ఉప్పునీటి బోర్లు వేస్తున్నా అధికారుల చోద్యం చూస్తున్నారు.

ఆక్వా సాగులో ఉప్పునీటి బోర్లు ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవంటూ అధికారులు హెచ్చరిస్తుంటారు. ఎవరి పని వారిదే అన్నట్లు ఎన్నో అక్రమ బోర్లు వెలుస్తున్నాయి. సాధారణంగా 200 అడగుల లోపు అయితే మంచి నీరు వస్తుంది. కానీ ఉప్పునీరు కావాలంటే సుమారు 500 నుంచి 650 అడుగుల పైబడి బోరు తీయాల్సి ఉంటుంది. రొయ్యల చెరువులకు ఉప్పునీరే కావాలి.

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో సుమారు రూ.1.50 లక్షల ఎకరాల్లో ఆక్వా సాగు జరుగుతోంది. దీంట్లో సుమారు రూ.లక్ష ఎకరాల్లో రొయ్యల సాగు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. అన్నిచోట్లా అక్రమంగా బోర్లతోనే సాగు చేస్తున్నారు. దీనివల్ల భూగర్భ జలాలు సైతం కలుషితమవుతున్నాయి. గతంలో కొన్ని మండలాల్లో అక్రమంగా ఉప్పునీటి బోర్లు వేసిన రైతులకు నోటీసులిచ్చారు. ఇటీవల కాలంలో ఇలాంటి వాటిపై ఎక్కడా నిఘా పెట్టలేదు. చర్యలు తీసుకున్నదీ లేదు.

భూగర్భ జలాలూ కలుషితం

ఉప్పునీటి బోర్ల వల్ల భూగర్భ జలాలు పాడై పర్యావరణానికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని పర్యావరణ వేత్తలు, నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఆయా గ్రామాల పరిధిలో ఉన్న రాజకీయ నాయకుల అండదండలతో బోర్లు వేస్తున్నారని, అందుకే అధికారులు అటువైపు చూడడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారులు పట్టించుకుంటే ఈ పరిస్థితి ఉండదు. ఆక్వా జోన్ పేరిట జిల్లాలో ఇష్టానుసారం చెరువులు తవ్వడం, పంట కాలువల వెంబడి ఎగువ ప్రాంతంలో సాగు చేస్తున్న చేపలు, రొయ్యల చెరువుల నీటిని పంట కాలువల్లోకి వదిలేయడంతో తాగు, సాగునీరు కలుషితమవుతోంది.

కాళ్ల మండలంలో చేపల సాగు పది వేల ఎకరాల్లో, రొయ్యల సాగు ఆరు వేల ఎకరాల్లో చేపడుతున్నారు. కొత్తగా తవ్విన చెరువుల వద్ద ఉప్పునీటి బోర్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటివరకు ఆరు వేల ఎకరాల్లో రొయ్యల చెరువుల వద్ద ఉప్పునీటి బోర్లు ఉన్నాయి. ఏ పంట కాల్వ చూసినా, మంచినీటి చెరువులో చూసినా ఉప్పు నీటి శాతం సుమారు ఐదు శాతం ఉంటుందని అధికారుల అంచనా. ఈ నీరు తాగి వ్యాధుల బారిన పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు. రొయ్యల చెరువులో నీరు బయటకు వెళ్లేందుకు మురికి నీరు వ్యవస్థ ఏర్పాటు చేయకపోవడంతో రొయ్యల చెరువులోని కలుషిత నీరు పంట కాలవ లోకి నేరుగా వదిలేస్తున్నారు. కాళ్ల మండలంలో 21 గ్రామాలున్నాయి. ప్రధానంగా ఉండి కెనాల్, వెంకయ్యవయ్యేరు, అనాకోడేరు పంట కాలువల నీరే ప్రధానాధారం. కె.లంకఛానల్, అజ్జమూరు, బొండాడ, అన్నయ్యకోడు, బొండాడ కాళ్లకూరు, కోలన్నపల్లి పంట కాలువలోకి రొయ్యల చెరువుల నీరు వదిలేస్తున్నారు. దీంతో పంట కాలువలు కలుషితంగా మారాయి. అధికారులు పట్టించుకోని ఉప్పునీటి బోర్లను శాశ్వతంగా తొలగించి పంట కాలువలను, మంచినీటి చెరువులను కాలుష్యం బారిన పడకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పడిపోతున్న భూగర్భ జలాలు

అక్రమ బోర్లు, ఆక్వా చెరువుల తవ్వకాల వల్ల భూగర్భ జలాలు పడిపోతున్నాయి. కలుషితం కూడా అవుతున్నాయి. ఇది పర్యావరణానికి పెనుముప్పుగా పరిణమించింది. దీంతో పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తక్షణం స్పందించాలని సూచిస్తున్నారు.

ఉప్ప నీటి బోరును తొలగించాలి
మొగల్ల మాధవరావు, కాళ్ల గ్రామస్తుడు

కె.లంక పంట కాలువకు ఆనుకుని ఉప్పునీటి బోరు బోరు నిబంధనలకు విరుద్ధంగా వేస్తున్నారు. ఈ పంట కాలువలో ఆరు వేల ఎకరాల చేపలు, రొయ్యల చెరువులు సాగవుతున్నాయి. ఏడు వేల మంది జనాభా ఉన్నారు. ఉప్పునీటిని కె.లంకఛానల్ పంట కాలువలోకి యథేచ్ఛగా వదిలేస్తున్నారు. ఉప్పునీరు పంట కాలవ నుంచి మంచినీటి చెరువులకు రావడంతో గ్రామ ప్రజలు తాగునీటి కోసం నానా అవస్థలు పడుతున్నారు. మినరల్ నీటిని కొనుగోలు చేయాల్సి వస్తుంది. రైతులు, ప్రజల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు స్పందించాలి. నిబంధనలకు విరుద్ధంగా తవ్వుతున్న ఉప్పు నీటి బోరును తొలగించాలి.

కోలనపల్లిలో కె లంకఛానల్‌కు ఆనుకుని వేస్తున్న ఉప్పునీటి బోరు

ఉప్పునీటి బోర్లకు అనుమతుల్లేవు
టిఎ.కృష్ణారావు, కాళ్ల తహశీల్దార్

మండలంలో ఎక్కడా ఉప్పునీటి బోర్లకు అనుమతి ఇవ్వలేదు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా బోర్లు ఏర్పాటు చేస్తే సంబంధింత గ్రామ రెవెన్యూ సిబ్బంది ద్వారా దర్యాప్తు చేసి శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.